సాక్షి రంగారెడ్డి

సోమవారం ׀ 28 ׀ అక్టోబర్ ׀ 2024



వికసిత్ భారత్ లక్ష్యం

వికసిత్ భారత్ నిర్మాణమే తమ ఏకైక లక్ష్యమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందె బాబయ్య అన్నారు.

8లో▸



మొక్కలు నాటాలి

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని యాంటి కరప్షన్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా ఎస్సీ సెల్ అధ్యక్షుడు యాదయ్య పేర్కొన్నారు.

8లో▸



మందపై కుక్కల దాడి

అర్ధరాత్రి సమయంలో గొర్రెల మందపై కుక్కలు దాడి చేయడంతో పదిహేను జీవాలు మృతి చెందాయి.

8లో▸

న్యూస్‌రీల్

ప్రశాంతంగా గ్రూప్‌-1 పరీక్షలు

మొయినాబాద్‌రూరల్‌: మండల పరిధిలోని ఆయా విద్యాసంస్థల్లో కొనసాగుతున్న గ్రూప్‌–1 పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయని తహసీల్దార్‌ గౌతమ్‌కుమార్‌ తెలిపారు. ఆదివారం మండల పరిధిలోని జోగన్‌పల్లి బీఆర్‌ ఇంజనీరింగ్‌ కళాశాలలో 816 మందికి గాను 445 మంది హాజరుకాగా, అజీజ్‌నగర్‌ చౌరస్తాలోని విద్యాజ్యోతి ఇంజనీరింగ్‌ కళాశాలలో 880 మందికి గాను 404 అభ్యర్థులు హాజరైనట్లు ఆయన తెలిపారు. మండల కేంద్రంలో పరీక్షలు పోలీసుల పకడ్బందీ పర్యవేక్షణలో ప్రశాంతంగా కొనసాగుతున్నాయని తహసీల్దార్‌ పేర్కొన్నారు.

ఎంపీకి సన్మానం



ఎంపీ కొండా విశ్వేశ్వరరెడ్డిని సన్మానిస్తున్న ప్రభాకర్‌రెడ్డి తదితరులు

మొయినాబాద్‌: జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ సభ్యుడిగా మండలంలోని శ్రీరాంనగర్‌ గ్రామ మాజీ సర్పంచ్‌ సన్‌వెల్లి ప్రభాకర్‌రెడ్డి నియమితులయ్యారు. చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వరరెడ్డి చైర్మన్‌గా కేంద్ర ప్రభుత్వం రంగారెడ్డి జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీలో శ్రీరాంనగర్‌కు చెందిన ప్రభాకర్‌రెడ్డిని సభ్యుడిగా ప్రభుత్వం నామినేట్‌ చేసింది. కమిటీ సభ్యుడిగా నియమితులైన ప్రభాకర్‌రెడ్డి ఆదివారం ఎంపీ కొండా విశ్వేశ్వరరెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. తనపంతు బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తానని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కేఎస్‌ రత్నం, బీజేపీ మండల మాజీ అధ్యక్షుడు గున్నాల గోపాల్‌రెడ్డి, నాయకులు మాధవరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్‌, సుధాకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

విశ్వకర్మ కార్పొరేషన్‌ ఏర్పాటు చేయాలి



సమావేశంలో పాల్గొన్న విశ్వకర్మ వృత్తిదారుల సంఘం రాష్ట్ర నాయకులు

మీర్‌పేట: విశ్వకర్మ కార్పొరేషన్‌ ఏర్పాటు చేసి బడ్జెట్‌లో రూ.250 కోట్ల నిధులు కేటాయించాలని విశ్వకర్మ వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాళ్లబండి కుమారస్వామి డిమాండ్‌ చేశారు. మీర్‌పేటలో ఆదివారం జరిగిన తెలంగాణ రాష్ట్ర విశ్వకర్మ వృత్తిదారుల సంఘం విస్తృతస్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కార్పొరేట్‌ స్థాయి కంపెనీల రాకతో గ్రామాల్లో విశ్వకర్మ వృత్తిదారులు పనులు లేక ఉపాధి కోసం నగరానికి వలస వెళ్లి ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రత్యేకంగా కార్పొరేషన్‌ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. దీంతో పాటు వృత్తిదారుల కుటుంబాల్లో చదువుకున్న నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. సమావేశంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు సుంకోజు యాదగిరిచారి, శ్రీనివాసచారి, సహాయ కార్యదర్శి భీష్మాచారి, నాయకులు లెల్లెల బాలకృష్ణ, నరసింహాచారి, కృష్ణమాచారి, యాచారం నారాయణ, రామాచారి, సంతోష్‌కుమార్‌, శివకోటి, విష్ణుచారి తదితరులు పాల్గొన్నారు.

సంబరంగా సదర్‌







సదర్‌ సంబరాలు అంబరాన్నంటాయి. డప్పు దరువులకనుగుణంగా దున్నపోతుల విన్యాసాలు, యాదవుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఆదివారం ఇందిరా పార్కు సమీపంలో పీసీసీ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌, మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌ యాదవ్‌ ఆధ్వర్యంలో నిర్వహించిన సదర్‌ ఉత్సవాలకు సీఎం రేవంత్‌రెడ్డి, స్పీకర్‌ ప్రసాద్‌కుమార్‌, మంత్రి పొన్నం ప్రభాకర్‌ తదితరులు హాజరయ్యారు.

‘భూమాత’.. ఎప్పటికో రాక!

- పెండింగ్‌లో భూ సమస్యలు
- ధరణి పోర్టల్‌తో దొరకని పరిష్కారం
- ఇష్టానుసారంగా రిజెక్ట్‌ చేస్తున్న రెవెన్యూ అధికారులు
- తహసీల్దార్‌ కార్యాలయాల చుట్టూ రైతుల ప్రదక్షిణలు
- కాంగ్రెస్‌ సర్కార్‌ తెచ్చే ‘భూమాత’ కోసం ఎదురుచూపులు



యాచారం తహసీల్దార్‌ కార్యాలయం

యాచారం: భూమాత ఎప్పుడొస్తావమ్మా.. అంటూ రైతులు కంటికికాయలు కాసేలా ఎదురుచూస్తున్నారు. ధరణి పోర్టల్‌తో భూ సమస్యలు పరిష్కారం కాక రైతులు నేటికీ ఇబ్బందులు పడుతున్నారు. యాచారం–కందుకూరు మండలాల సరిహద్దులోని ఫార్మాసిటీకి సేకరించిన భూమిలో రేవంత్‌రెడ్డి సర్కార్‌ ఫ్యూచర్‌సిటీ నిర్మాణానికి సంకల్పించడం తెలిసిందే. దీంతో యాచారం, కందుకూరు, ఇబ్రహీంపట్నం, మంచాల, కడ్తాల్‌, ఆమనగల్లు, మహేశ్వరం తదితర మండలాల్లోని అనేక గ్రామాల్లో వ్యవసాయ భూములకు భలే డిమాండ్‌ వచ్చింది. ఈ క్రమంలో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న తమ భూ సమస్యలు కొలిక్కి రాకపోవడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. మీ సేవల్లో రూ.వేలాది ఫీజులు చెల్లించి దరఖాస్తు చేసుకున్నా లాగిన్లలో రెవెన్యూ అధికారులు సరైన ధ్రువీకరణ పత్రాలు లేవని రిజెక్ట్‌ చేస్తున్నారు. ఈ విషయమై ఆయా మండలాల్లోని తహసీల్దార్‌ కార్యాలయాల్లో సంప్రదించగా అధికారుల నుంచి సరైన సమాధానమే ఉండడం లేదని వాపోతున్నారు. కొన్ని గ్రామాల్లో భూ సమస్యలు పరిష్కరించుకోవడం కోసం డబ్బుల్లేక రైతులు తమ వ్యవసాయ భూములను విక్రయించుకున్న దాఖలాలు సైతం ఉన్నాయి.

రిజెక్ట్‌పై సమాచారం కరువు

యాచారం మండలంలోని 24 గ్రామాల్లో ధరణి పోర్టల్‌లో 2,550 భూ సమస్యలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. అందులో టీఎం–33 మ్యాడుళ్ల కింద 1,557, వివిధ రకాల మ్యాడుళ్ల కింద 993 సమస్యలు ఉన్నట్లు తేల్చారు. సమస్యల పరిష్కారం కోసం రైతులు మీ సేవల్లో రూ.వెయ్యి నుంచి రూ.2,500 వరకు డబ్బులు చెల్లించి దరఖాస్తు చేసుకున్నారు. పరిష్కరించాల్సిన రెవెన్యూ అధికారులు సరైన ధ్రువీకరణ, రికార్డులు లేవనే సాకుతో ఇష్టానుసారంగా రిజెక్ట్‌ చేశారు. మొత్తం 2,550 దరఖాస్తుల్లో 1,800కు పైగా తిరస్కరణకు గురయ్యాయి. ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులను ఎందుకు రిజెక్ట్‌ చేస్తున్నారనే విషయమై దరఖాస్తుదారుడికి స్పష్టమైన సమాచారం (దరఖాస్తులో పేర్కొన్న ఫోను నంబరుకు) అందించాల్సి ఉంటుంది. అధికారులు మాత్రం అవేవీ పాటించడం లేదు.

కొత్త పోర్టల్‌పై ఆశలు

ధరణి పోర్టల్‌లోని నిబంధనలతో రైతులు తమ భూ సమస్యలు పరిష్కరించుకోవడంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని గుర్తించిన రేవంత్‌రెడ్డి సర్కార్‌ భూమాతను తేవాలని చూస్తోంది. దీనికి సంబంధించిన నిబంధనలు ఇంకా ఖరారు కానప్పటికీ ఆయా మండలాల్లోని తహసీల్దార్లు మాత్రం త్వరలో భూమాత వస్తుంది, మీ సమస్యలు త్వరగా పరిష్కరమయ్యే అవకాశం ఉందని చెబుతూ కార్యాలయాలకు వచ్చే రైతులను తిరిగి పంపిస్తున్నారు. భూ సమస్యలు పరిష్కారం కాక.. పట్టాదారు, పాసుపుస్తకాలు రాక రైతులు బ్యాంకు రుణాలు, రైతుబంధు, ఇతర ప్రయోజనాలు పొందక తీవ్రంగా నష్టపోయారు. దీంతో కాంగ్రెస్‌ సర్కార్‌ తీసుకువచ్చే భూమాత కోసం నిరీక్షిస్తున్నారు.

ఏళ్లుగా తిరుగుతున్నా..



పట్టా భూమి రికార్డులను ధరణి పోర్టల్‌లో నమోదు చేసి పట్టాదారు, పాసుపుస్తకం జారీ చేయాలని ఏళ్లుగా యాచారం తహసీల్దార్‌ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా. తాడిపర్తి గ్రామంలోని సర్వే నంబర్‌ 239లో 20 గుంటలు, సర్వేనంబర్‌ 159లో ఎకరా 20 గుంటల పట్టా భూమిని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని పలుమార్లు దరఖాస్తు చేసుకున్నా ఫలితం లేదు. ఇప్పుడేమో భూమాత అంటున్నారు.

– బైకని సాయిలు, రైతు, నానక్‌నగర్‌

సక్రమంగా లేని దరఖాస్తులనే..



ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తుల్లో సరైన రికార్డులు లేని వాటినే తిరస్కరించడం జరిగింది. త్వరలో భూమాత వచ్చే అవకాశం ఉంది. అందులో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే సమస్యలు త్వరగా పరిష్కరించే అవకాశం ఉందని తెలుస్తోంది. నిత్యం భూ సమస్యలు పుట్టుకొస్తూనే ఉన్నాయి. సరైన రికార్డులున్న మ్యాడుళ్ల దరఖాస్తులను పరిష్కరిస్తున్నాం.

– అయ్యప్ప, తహసీల్దార్‌, యాచారం

సస్పెన్షన్లు ఎత్తి వేయండి

3వ టీజీఎస్పీ బెటాలియన్‌ పోలీసుల నిరసన

ఇబ్రహీంపట్నం: సస్పెన్షన్లు ఎత్తివేయాలని టీజీఎస్పీ బెటాలియన్‌ పోలీసులు నిరసన వ్యక్తం చేశారు. టీజీఎస్పీ హఠావో–ఏక్‌ పోలీస్‌ బనావో అంటూ నినాదాలు చేశారు. ఇబ్రహీంపట్నంలోని అంబేద్కర్‌ విగ్రహం ముందు ఆదివారం రాత్రి కొవ్వొత్తులు వెలిగించి నిరసన వ్యక్తం చేశారు. టీజీఎస్పీ పోలీసుల సమస్యలను పరిష్కరించాలని శాంతియుతంగా ఆందోళన చేస్తుంటే సస్పెన్షన్‌లకు పూనుకోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. సస్పెన్షన్‌లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్‌ చేశారు.



కొవ్వొత్తులు వెలిగించి నిరసన తెలుపుతున్న 3వ టీజీఎస్పీ బెటాలియన్‌ పోలీసులు

గిరిజన చట్టాలను అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న రవీంద్రాచారి

సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవీంద్రాచారి

మీర్‌పేట: గిరిజన చట్టాలను ప్రభుత్వాలు పకడ్బందీగా అమలు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందోజు రవీంద్రాచారి డిమాండ్‌ చేశారు. మీర్‌పేట లెనిన్‌నగర్‌లో ఆదివారం జరిగిన తెలంగాణ గిరిజన సమాఖ్య బాలాపూర్‌ మండల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని నిర్వీర్యం చేసే విధంగా ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. తద్వారా గిరిజనులపై దాడులకు పాల్పడే దోషులకు శిక్షలు పడటం లేదన్నారు. ముఖ్యంగా అటవీ హక్కుల చట్టం ప్రకారం గిరిజనులకు భూములు దక్కకపోగా, దున్నుకుంటున్న భూములను సైతం అటవీశాఖ అధికారులు బలవంతంగా లాక్కుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గిరిజనులకు చెందాల్సిన భూములకు ప్రభుత్వమే పట్టా ఇచ్చి అందజేయాలని, దీంతో పాటు ఎస్సీ,ఎస్టీ సబ్‌ప్లాన్‌ ప్రకారం ఎస్టీలకు జనాభా పరంగా కేటాయించిన నిధులను వారికే ఖర్చు చేయాలని కోరారు. లేదంటే రాష్ట్ర వ్యాప్తంగా గిరిజన సమాఖ్య ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని ఆయన హెచ్చరించారు. అనంతరం బాలాపూర్‌ మండల గిరిజన సమాఖ్య నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జటావత్‌ రెడ్యానాయక్‌, కార్యదర్శిగా రమావత్‌ ఛత్రునాయక్‌, ఉపాధ్యక్షుడిగా రవినాయక్‌, సహాయ కార్యదర్శిగా కేతావత్‌ బాలునాయక్‌, కోశాధికారిగా నేనావత్‌ కిషన్‌నాయక్‌, కార్యవర్గ సభ్యుడిగా హన్మానాయక్‌, కౌన్సిల్‌ సభ్యుడిగా దత్తునాయక్‌ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సర్కారు చదువుకు సాన

- ప్రభుత్వ బడుల బలోపేతంపై నజర్‌
- రేపు నగరంలో ఎంఈఓలకు శిక్షణ
- నగర శివారు జిల్లాల నుంచి హాజరు కానున్న 42 మంది ఎంఈఓలు

సాక్షి, సిటీబ్యూరో: సర్కారు బడుల బలోపేతంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోంది. ఇటీవల ప్రతి మండలానికి ఒక ఎంఈఓను నియమించి వారికి ప్రత్యేక శిక్షణ ఇచ్చేందుకు పాఠశాల విద్యాశాఖ కార్యాచరణ రూపొందించింది. ఈ నెల 29న (మంగళవారం) హైదరాబాద్‌లో శిక్షణ నిర్వహించనున్నట్లు పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. నగర శివారు మేడ్చల్‌–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల నుంచి 42 మంది ఎంఈఓలు శిక్షణకు హాజరు కానున్నారు.

పర్యవేక్షణకు ప్రాధాన్యం

☛ ప్రాథమిక పాఠశాలల్లో చదువుతున్న 1–5 తరగతుల విద్యార్థుల్లో కనీస అభ్యసన సామర్థ్యాలను పెంపొందించేందుకు ఎఫ్‌ఎల్‌ఎన్‌ (ఫండమెంటల్‌ లిటరసీ న్యూమరసీ) పేరుతో తొలిమెట్టు కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు. ఉన్నత పాఠశాలల్లోని 6–9 తరగతుల విద్యార్థులకు అభ్యసనాభివృద్ధి కార్యక్రమం (లిప్‌)ను ఉన్నతి పేరుతో అమలు చేస్తున్నారు. పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత కోసం విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. పాఠశాల స్థాయిలో విద్యాశాఖ చేపట్టిన తొలిమెట్టు, ఉన్నతి తదితర కార్యక్రమాలు సక్రమంగా అమలయ్యేలా ఎంఈఓలు పర్యవేక్షణ చేయాలి. వివరాలను పాఠశాల విద్యాశాఖ రూపొందించిన యాప్‌లో నమోదు చేయడంలో ఎంఈఓలకు శిక్షణ ఇవ్వనున్నారు.

☛ గతంలో కాంప్లెక్స్‌ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, మండల నోడల్‌ అధికారి, మండల విద్యాధికారి వ్యవస్థ అమలులో ఉండేది. సీనియర్‌ హెచ్‌ఎంలు ఇన్‌చార్జి ఎంఈఓలుగా బాధ్యతలు నిర్వహించేవారు. వీరికి (ఒక్కో ఇన్‌చార్జి ఎంఈఓకు) రెండు నుంచి ఆరు మండలాల అదనపు బాధ్యతలు ఉండటంతో సరైన పర్యవేక్షణ నిర్వహించలేక పోయారు. ఎంఎన్‌ఓగా పనిచేస్తున్న సీనియర్‌ హెచ్‌ఎంలను ప్రస్తుతం ఎంఈఓలుగా నియమించారు. మేడ్చల్‌ –మల్కాజిగిరి జిల్లాలో 15 మండలాలు ఉండగా.. ఒక ఉప్పల్‌ మండలానికి మాత్రమే రెగ్యులర్‌ ఎంఈఓ ఉన్నారు. మిగతా 14 మండలాలకు ఎంఎన్‌ఓగా పనిచేస్తున్న సీనియర్‌ హెచ్‌ఎంలు ఎంఈఓలుగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. రంగారెడ్డి జిల్లాలో కూడా ఇదే పరిస్థితి నెలకొని ఉంది. ఈ నేపథ్యంలోనే విద్యా ప్రమాణాల పెంపుదలకోసం ఎంఈఓలకు ఒక రోజు శిక్షణ ఇవ్వనున్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న గవర్నర్‌ జిష్ణుదేవ్‌ వర్మ

దేశభక్తిని పెంపొందించాలి

గవర్నర్‌ జిష్ణుదేవ్‌ వర్మ

ముషీరాబాద్‌: విద్యార్థులు, యువతలో దేశభక్తిని మరింత పెంపొందించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని గవర్నర్‌ జిష్ణుదేవ్‌ వర్మ సూచించారు. ఆదివారం ముషీరాబాద్‌లోని ఆర్యవైశ్య భవన్‌లో భారత వికాస్‌ పరిషత్‌ ఆధ్వర్యంలో చిన్నారులకు దేశభక్తి బృందగానం పోటీలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన గవర్నర్‌ మాట్లాడుతూ.. మన దేశ సంస్కృతి, సంప్రదాయాలపై చిన్ననాటి నుంచే పిల్లల్లో బీజం వేయాలని సూచించారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు యువతలో జాతీయ భావజాలం, దేశభక్తి, క్రమశిక్షణ పెంపొందించేందుకు భారత్‌ వికాస్‌ పరిషత్‌ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. దేశభక్తి పాటల పోటీలలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులు డిసెంబర్‌ 15న బెంగళూర్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. భారత్‌ వికాస్‌ పరిషత్‌ తెలంగాణ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు సతీష్‌గౌడ్‌, నాగరాజులు మాట్లాడుతూ.. దక్షిణ భారత దేశ భక్తి బృందగాన పోటీలకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌, కర్ణాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున విద్యార్థులు హాజరైనట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పోటీలలో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో భారత వికాస్‌ పరిషత్‌ సౌత్‌ రీజినల్‌ ప్రధాన కార్యదర్శి పురుషోత్తం శాస్త్రి, సంయుక్త కార్యదర్శి నరేంద్రకృష్ణ, నాగేందర్‌, విష్ణువర్ధన్‌రెడ్డి, రాజాలింగం, అంబిక, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారులను విస్మరించిన ప్రభుత్వం

టీయూఎఫ్‌ రాష్ట్ర వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ బల్‌దేవ్‌ రెడ్డి



సమావేశంలో ఉద్యమకారుల అభివాదం

తుర్కయంజాల్‌: తెలంగాణ ఉద్యమకారులను కాంగ్రెస్‌ ప్రభుత్వం విస్మరించిందని టీయూఎఫ్‌ రాష్ట్ర వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ కందాల బల్‌దేవ్‌ రెడ్డి విమర్శించారు. ఉద్యమకారులకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్‌ చేశారు. ఆదివారం ఫోరం జిల్లా అధ్యక్షుడు యాదిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో ఉద్యమకారుల పాత్ర కీలకమైందన్నారు. పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్‌ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయలేదని ఆరోపించారు. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికలకు ముందు ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం, పింఛన్లు, ఉచిత బస్సు సౌకర్యం వంటి హామీలు ఇచ్చారని పేర్కొన్నారు. ఇచ్చిన మాటను నెలాఖరులోగా నిలబెట్టుకోవాలని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్‌, ఆర్గనైజింగ్‌ సెక్రటరీ నరేందర్‌, దక్షిణ తెలంగాణ అధ్యక్షురాలు శ్యామల, బీజేపీ ఎస్సీమోర్చా రాష్ట్ర కార్యదర్శి రమేష్‌, మున్సిపాలిటీ అధ్యక్షుడు జంగయ్య గౌడ్‌, నాయకులు వీరస్వామి గౌడ్‌, దాసుగౌడ్‌ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



శంకర్‌పల్లి: ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు



షాద్‌నగర్‌రూరల్: ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

షాద్‌నగర్‌రూరల్: పట్టణంలోని హరిజనవాడ ప్రాథమికోన్నత పాఠశాలలో 1996–97లో 7వ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఒకరికొకరూ ఆత్మీయంగా పలకరించి పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు భారతమ్మ, విజయలక్ష్మి, ఝాన్సీ, విద్యార్థులు శివశంకర్, శ్రీకాంత్, ఆనంద్, రాజ్‌కుమార్, ఉదయ్, జగదీశ్వర్, రాజేశ్, వెంకటేశ్, బాలమణి, కస్తూరి, కల్పన, కవిత, అనిత, రమ, రాధిక, అనురాధ, దుర్గేశ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

శంకర్‌పల్లి: మండల పరిధిలోని జన్వాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2002–03 సంవత్సరంలో పదో తరగతి పూర్తయిన విద్యార్థులు ఆదివారం జన్వాడలోని గ్రీన్ ఫీల్డ్ హాలులో ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసుకున్నారు. ఈ సందర్భంగా వారికి విద్యాబుద్ధులు నేర్పిన గురువులకు శాలువా, పూలదండలు వేసి ఘనంగా సన్మానించారు. అనంతరం తమతో పాటు చదువుకొని మృతి చెందిన స్నేహితులకు నివాళులర్పించారు. ఒకరికొకరూ ఆప్యాయంగా పలకరించుకొని మురిసిపోయారు. ముగింపులో పాఠశాల మరమ్మతుల కోసం తమవంతు సాయం చేసేందుకు ముందుంటామని స్పష్టం చేశారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి




మొక్క నాటిన గ్రామస్తులు

షాబాద్: పచ్చదనం, వాతావరణ సమతుల్యానికి ప్రతి ఒక్కరూ విరివిగా మొక్కలు నాటి సంరక్షించాలని యాంటి కరప్షన్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు బేగరి యాదయ్య పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని చందనవెల్లి గ్రామంలో గ్రామస్తులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తమవంతుగా మొక్కలు నాటి, సంరక్షణ బాధ్యతలు చేపట్టాలన్నారు. గ్రామాల్లో ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటి, గ్రామాన్ని పచ్చగా కళకళలాడేలా చూడాలన్నారు. పర్యావరణాన్ని పరిరక్షిస్తేనే మానవ మనుగడ సాధ్యమవుతుందన్నారు. ఆరోగ్యవంతమైన మానవ జీవన మనుగడకు 33 శాతం అడవులు ఉండాలని, ప్రస్తుతం 24 శాతం మాత్రమే ఉన్నాయన్నారు. మొక్కలు నాటి అడవులను పెంచేందుకు కృషి చేస్తే భవిష్యత్ తరాల వారికి ఎంతో మేలు చేసినవారవుతామని సూచించారు. కార్యక్రమంలో గ్రామస్తులు సత్తయ్య, వెంకట్, రాజ్‌కుమార్, ప్రభాకర్, సుధాకర్, శ్రీకాంత్, మధుసూదన్‌రెడ్డి, యాదయ్య, రత్నాకుమార్, తదితరులు ఉన్నారు.

చికిత్స పొందుతూ గృహిణి మృతి

చేవెళ్ల: కుటుంబకలహాల నేపథ్యంలో భార్యాభర్తలు గొడవపడగా మనస్తాపానికి గురైన భార్య పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. వెంటనే కుటుంబసభ్యులు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ సంఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని చనువెల్లిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వికారాబాద్ జిల్లా పూడూరు మండలం పోతిరెడ్డిగూడకు చెందిన వనజ (28)కు చేవెళ్ల మండలంలోని చనువెల్లి గ్రామానికి చెందిన నగేశ్‌తో 11ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు (ఓ కూతురు, కుమారుడు) ఉన్నారు. వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. శనివారం రాత్రి ఇంట్లో కుటుంబ విషయాలపై భార్యాభర్తలు గొడవపడ్డారు. దీంతో ఆమె మనస్తాపంతో పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. వెంటనే కుటుంబ సభ్యులు వికారాబాద్‌లోని ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న ఆమె ఆదివారం తెల్లవారుజామున మృతి చెందింది. మృతురాలి సోదరుడు వంశీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహానికి చేవెళ్ల ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు.

బైక్ ఢీ.. వ్యక్తి మృతి



రాంరెడ్డి మృతదేహం

కేశంపేట: బైక్‌ను అజాగ్రత్తగా నడిపి రోడ్డు దాటుతున్న వ్యక్తిని ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. కేశంపేట గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని బోదునంపల్లి గ్రామానికి చెందిన బండ రాంరెడ్డి(62) కేశంపేట గ్రామంలోని వైన్స్‌షాపు దగ్గర రోడ్డు దాటుతుండగా కేశంపేట వైపు వస్తున్న బైక్ ఢీ కొట్టినట్టు తెలిపారు. ఈ ఘటనలో రాంరెడ్డి ప్రమాద స్థలంలోనే మృతి చెందినట్టు గ్రామస్తులు తెలిపారు. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ సంఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

వికసిత్ భారత్ నిర్మాణమే లక్ష్యం

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందె బాబయ్య



పార్టీ సభ్యత్వ నమోదులో పాల్గొన్న బాబయ్య, నాయకులు

షాద్‌నగర్: వికసిత్ భారత్ నిర్మాణమే లక్ష్యంగా ప్రజలందరూ పెద్దఎత్తున పార్టీ సభ్యత్వాలను తీసుకోవాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందె బాబయ్య అన్నారు. ఆదివారం ఫరూఖ్‌నగర్ మండలం ఎలికట్ట గ్రామంలో బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎంకనోళ్ల వెంకటేశ్ ఆధ్వర్యంలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బాబయ్య మాట్లాడుతూ.. ప్రపంచంలో అత్యధిక సభ్యత్వాలు కలిగిన పార్టీ బీజేపీ అని అన్నారు. దేశ రక్షణ, సంస్కృతి సంప్రదాయాలు కాపాడాలంటే బీజేపీతోనే సాధ్యమన్నారు. ప్రజలందరూ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజలకు వివరించి వారిని చైతన్య పరచాలని సూచించారు. అదేవిధంగా గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. తద్వార గ్రామస్థాయిలో పార్టీ బలోపేతమవుతుందన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ నాయకులు సత్తా చాటాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సంగెం శ్రీకాంత్, అంబటి వెంకటేశ్, పిట్టల జంగయ్య, శివకుమార్, రంజిత్, నర్సింలు, రాము, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వాన్ని వేగవంతం చేయాలి

నందిగామ: బీజేపీ సభ్యత్వాన్ని వేగవంతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రమైన నందిగామతో పాటు మేకగూడ, రంగాపూర్, అంతిరెడ్డిగూడ, అప్పారెడ్డిగూడ, చేగూరు తదితర గ్రామాల్లో కొనసాగుతున్న పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. ఈ నెల 31తేదీతో సభ్యత్వ నమోదు కార్యక్రమం ముగుస్తుందని, అంతలోపు లక్ష్యాన్ని పూర్తిచేయాలని పిలుపునిచ్చారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలకు ప్రజలు ఆకర్శితులై స్వచ్ఛందంగా బీజేపీలో చేరుతున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు చేగు సుధాకర్, మోహన్‌సింగ్, మహేందర్‌రెడ్డి, ప్రశాంత్‌గౌడ్, రాములు, భాను, అన్నారం రాజు, సత్యం తదితరులు పాల్గొన్నారు.

సొంత నిధులతో మినీ ఫంక్షన్‌హాల్

- ఔదార్యం చాటిన మాజీ ఎంపీపీ కుటుంబసభ్యులు
- అభినందించిన నాయకులు



మినీ ఫంక్షన్‌హాల్ ప్రారంభోత్సవంలో మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, ఇతర నాయకులు

చేవెళ్ల: ప్రజాప్రతినిధులుగా గెలిపించిన ప్రజలకు ఏదో ఒకటి చేయాలనే ఆలోచనతో తన ఎంపీటీసీ పరిధిలోని నాలుగు గ్రామాల ప్రజలకు ఉపయోగపడే విధంగా సొంత నిధులతో మినీ ఫంక్షన్ హాల్‌ను కట్టించి ప్రజలకు అప్పగించారు చేవెళ్ల మాజీ ఎంపీపీ మల్గారి విజయలక్ష్మీరమణారెడ్డి, వారి కుటుంబసభ్యులు. ఆదివారం ఈ మినీ ఫంక్షన్‌హాల్‌ను ఎంపీపీ విజయలక్ష్మీ, రమణారెడ్డి దంపతులు వారి కుటుంబసభ్యులతో కలిసి ప్రారంభించారు. స్వర్గీయ మల్గారి లక్ష్మి, భాగ్యమ్మ, మల్లారెడ్డిల జ్ఞాపకార్థంగా ఈ మినీ ఫంక్షన్‌హాల్‌ను మాల్గారి బ్రదర్స్ సహకారంతో నిర్మించారు. దీనిని రామన్నగూడ పంచాయతీకి ఆదివారం అప్పగించారు. ఈ మినీ ఫంక్షన్‌హాల్‌ను మండలంలోని ప్రజలు ఎవరైనా ఉపయోగించుకోవచ్చని దాతలు చెప్పారు. అనంతరం అక్కడే మాజీ ఎంపీపీ ఐదేళ్ల పాలనలో మండలంలో చేపట్టిన అభివృద్ధి పనులు, సేవా కార్యక్రమాలపై ప్రింట్ చేసిన బుక్‌ను విడుదల చేశారు. రామన్నగూడలో సొంత నిధులతో మల్గారి బ్రదర్స్ ఏర్పాటు చేసిన మినీ ఫంక్షన్‌హాల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కేఎస్.రత్నం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన గెలిపించిన ప్రజలకు సేవ చేయటంతో పాటు వారిపెద్దల జ్ఞాపకార్థం మినీ ఫంక్షన్‌హాల్‌ను ఏర్పాటు చేసిన మల్గారి బ్రదర్స్‌ను, మాజీ ఎంపీపీని ఆయనతోపాటు పలువురు నాయకులు అభినందించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మల్గారి. విజయభాస్కర్‌రెడ్డి, బీజేపీ జిల్లా యువ నాయకుడు డాక్టర్ మల్గారి వైభవ్‌రెడ్డి, న్యాయవాది మల్గారి దినేశ్‌రెడ్డి, మల్గారి కుటుంబసభ్యులు, మాజీ వైస్ ఎంపీపీ జంగం శివానందం, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పి. ప్రభాకర్, మాజీ ఎంపీటీసీ వెంకటేశం, ఎల్లయ్య, మాజీ సర్పంచ్‌ఎన్ను జంగారెడ్డి, సామ మానిక్యరెడ్డి, పలు పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గొర్రెల మందపై కుక్కల దాడి

15 గొర్రెలు మృత్యువాత




కుక్కల దాడిలో మృతి చెందిన గొర్రెలు

మొయినాబాద్: అర్ధరాత్రి సమయంలో గొర్రెల మందపై కుక్కలు దాడి చేయడంతో పదిహేను గొర్రెలు మృతి చెందాయి. ఈ సంఘటన మండల పరిధిలోని అప్పోజీగూడలో శనివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. బాధితులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం అప్పోజీగూడ గ్రామానికి చెందిన గొల్లగూడెం పెంటయ్య గొర్రెలు మేపుతూ జీవనం సాగిస్తున్నాడు. రోజు మాదిరిగానే శనివారం సాయంత్రం గొర్రెలను మందలో కట్టి పడుకున్నాడు. అర్ధరాత్రి సమయంలో వీధికుక్కలు గొర్రెల మందపై దాడి చేశాయి. విచక్షణారహితంగా కొరికేశాయి. కుక్కల దాడిలో 15 గొర్రెలు మృతి చెందాయి. సుమారు రూ.లక్ష వరకు నష్టం జరిగిందని బాధితులు చెబుతున్నారు. గ్రామంలో వీధి కుక్కల దాడులు ఎక్కువయ్యాయని.. నగరం నుంచి తీసుకొచ్చి గ్రామ శివారులు వీధికుక్కలను వదిలేస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గొర్రెలు మేపుతూ జీవనం సాగించే పెంటయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకుని నష్ట పరిహారం అందించాలని మాజీ సర్పంచ్ గొర్కంటి రాజు, గ్రామస్తులు కోరారు.

పట్టణ శివారులోని గుట్టపై పేలుళ్లు

పోలీసులకు ఫిర్యాదు



ఎస్ఐ బలరాంతో మాట్లాడుతున్న విష్ణువర్ధన్‌రెడ్డి

షాద్‌నగర్‌రూరల్: పట్టణ శివారులోని శ్రీ బాలాజీ టౌన్ షిప్ సమీపంలో ఉన్న రాళ్ల గుట్టను కొందరు వ్యాపారులు పేలుడు పదార్థాలతో పేల్చారు. భారీ ఎత్తున పేలుళ్లు చేపట్టడంతో చుట్టు పక్కన ఉన్న కాలనీలోని ఇళ్లు కంపించాయి. దీంతో ప్రజలు భయాందోళన చెందారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకున్న బీజేపీ నేత పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి పేలుళ్లు చేపట్టిన ప్రాంతానికి వెళ్లి పరిశీలించారు. అక్కడి నుంచి శంషాబాద్ డీసీపీకి ఫోన్ ద్వారా ఫిర్యాదు చేశారు. అక్రమంగా పేలుళ్లు చేపడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. సమాచారం అందుకున్న ఎస్ఐ బల్‌రాంతో పాటుగా సిబ్బంది అక్కడికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు.

భవనం పైనుంచి దూకి యువకుడి ఆత్మహత్య

బంజారాహిల్స్: భవనం పైనుంచి దూకి ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. శ్రీనగర్‌కాలనీలోని శ్రీసాయిరామ్ మనోర్ అపార్ట్‌మెంట్‌లో ఉంటున్న శ్రీనివాస్‌రెడ్డి రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడు. అతడి పెద్ద కొడుకు సాయిసుదీప్‌రెడ్డి(21) మహేంద్ర యూనివర్సిటీలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఇటీవలే శ్రీనివాస్‌రెడ్డి మధురానగర్‌కు మారాడు. ఈ నెల 24న సాయిసుదీప్‌రెడ్డి స్నేహితులతో కలిసి తన బర్త్‌డే వేడుకలు జరుపుకున్నాడు. 26న సాయంత్రం అతను తన స్నేహితులతో కలిసి సాయిరామ్ మనోర్ అపార్ట్‌మెంట్‌కు వెళ్లాడు. 5.30 సమయంలో తన స్నేహితుడు మనీష్‌తో పాటు మరో ఇద్దరితో కలిసి టెర్రస్ పైకి వెళ్లాడు. వారితో మాట్లాడుతున్న సాయిసుదీప్ సూర్యాస్తమయం చాలా బాగుంది చూడాలని వారి దృష్టి మరల్చి ఐదో అంతస్తు నుంచి కిందకు దూకాడు. తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. గత రెండు రోజులుగా తన కుమారుడు మూడీగా ఉంటున్నాడని, తీవ్ర డిప్రెషన్‌తో బాధపడుతున్నాడని మృతి తండ్రి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రహరి ధ్వంసం చేసిన వారిపై కేసు నమోదు

కొత్తూరు: అక్రమంగా ఇతరుల స్థలంలోకి ప్రవేశించడమే కాకుండా, ప్రహరీని ధ్వంసం చేసిన వారిపై కేసు నమోదు చేసినట్లు కొత్తూరు సీఐ నర్సింహ్మారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. కొత్తూరు పట్టణంలో జాతీయ రహదారి పక్కన ఇంటి నంబర్ 70డీలోని తమ ఇంటిలోకి ఈ నెల 25న కొత్తూరు మున్సిపల్ చైర్‌పర్సన్ భర్త దేవేందర్ యాదవ్, అతడి అనుచరులు మేకల రాఘవేందర్‌యాదవ్, లక్ష్మణ్‌లు అక్రమంగా ప్రవేశించి, ప్రహరీని ధ్వంసం చేసినట్లు తుప్పర రాములు ఆరోపించారు. ఆయన ఫిర్యాదు మేరకు సదరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

యాదవ సదర్ సమ్మేళనం పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద గల ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించే యాదవ సదర్ సమ్మేళనానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆదివారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో యాదవ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు దంగు శ్రీనివాస్‌యాదవ్, మల్లేశ్‌యాదవ్, నక్క బాల్‌రాజ్, భగవాన్‌దాస్, పద్మారం వెంకటేశ్, లింగంయాదవ్, శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ చైర్మన్‌ను కలిసిన నాయకులు



మధుసూదన్‌రెడ్డిని సన్మానిస్తున్న ఉపాధ్యాయ సంఘం నాయకులు

శంకర్‌పల్లి: గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్‌గా నియామకమైన ఎలుగంటి మధుసూదన్‌రెడ్డిని ఆదివారం టీయూటీఎఫ్ నాయకులు మర్యాద పూర్వకంగా ఆయన నివాసంలో కలిశారు. అనంతరం ఆయనకు పూలదండ, శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. మండల గ్రంథాలయాన్ని ఆధునీకరించి, మౌలిక వసతులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా గ్రామాల్లో గ్రంథాలయాలను అభివృద్ధి చేసి విద్యార్థులు, యువత, పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులకు బాసటగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ రాజశేఖర్‌రెడ్డి, టీయూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రఘునందన్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మునీర్ పాషా, శంకర్‌పల్లి మండల అధ్యక్షుడు అంజయ్య, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసచారి, ఉపాధ్యాయులు మోహన్‌రెడ్డి, సుదర్శన్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న లిటరరీ కార్నివాల్-2024



కార్నివాల్‌లో విద్యార్థుల ప్రదర్శనలు

ఫిలింనగర్: జూబ్లీహిల్స్‌లోని భారతీయ విద్యాభవన్ పబ్లిక్ స్కూల్ విద్యాశ్రమంలో రెండు రోజుల పాటు జరిగిన వార్షిక లిటరరీ కార్నివాల్–2024 విశేషంగా ఆకట్టుకుంది. వివిధ రకాల థీమ్‌లతో కొనసాగిన ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు కళాత్మక, సృజనాత్మక నైపుణ్యాన్ని చాటారు. రబీంద్రనాథ్ ఠాగూర్ రచించిన కాబూలీవాలా డ్రామా ద్వారా విద్యార్థులు పాత్రలకు జీవం పోసి ఆకట్టుకున్నారు. అలాగే సరోజినీనాయుడు రచించిన కవితలను వినిపించి అందులో సారాంశాన్ని ఆవిష్కరించి ఆలోచింపజేశారు. బీబీసీ కామెడీ షో, మ్యూజిక్ కన్సర్ట్‌లు అపరిమితమైన వినోదాన్ని పంచాయి. జూనియర్ విద్యార్థులు ప్రదర్శించిన మంకీ అండ్ ది క్రొకడైల్ స్కిట్ ఆహుతులను కట్టిపడేసింది. బట్టర్‌ఫ్లై డ్యాన్స్ ఓలలాడించింది. ప్రముఖ రచయితలు రచించిన కవితలు, పద్యాలు సాహిత్య పరిజ్ఞానాన్ని పంచాయి. అనంతరం స్టూడెంట్స్ క్యారెక్టర్ పరేడ్ నిర్వహించారు. వీటితో పాటు పోయిట్రీ ఇన్‌స్టాలేషన్, న్యూస్ రీడింగ్, డైలాగ్ రైటింగ్, రైటింగ్ బుక్, జాకెట్ డిజైనింగ్, కల్చరల్ స్పీచ్, లిటరరీ క్విజ్ డిబేట్ తదితర అంశాలను ప్రదర్శించి విద్యార్థులు తమ సృజనకు పదునుపెట్టారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ అరుణశ్రీ మాట్లాడుతూ లిటరరీ కార్నివాల్ విద్యార్థుల్లో సాహితీ అభిలాషను పెంచుతుందన్నారు. ప్రముఖ కవులు, రచయితలు రచించిన కవితలు, పద్యాలు విద్యార్థుల్లో సాహితీ పరిజ్ఞానాన్ని పెంపొందింపజేస్తాయని, ఆ దిశగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందన్నారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తి మృతి

నాగోలు: బైక్ అదుపుతప్పి కిందపడటంతో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన నాగోలు పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. నాగోలు ఎస్ఐ రమేష్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. మేడ్చల్ జిల్లా, కొర్రెములకు చెందిన పడిగం జంగయ్య(43) టైలర్‌గా పని చేసేవాడు. ఈనెల 25న బైక్‌పై బొంగుళూరుకు వెళుతుండగా గౌరెల్లి చౌరస్తా సమీపంలో బైక్ అదుపు తప్పి కింది పడటంతో అతని తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అతడిని బీఎస్‌రెడ్డి నగర్‌లోని వెల్‌నెస్ హాస్పిటల్‌కు తరలించగా పరీక్షించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం ఉస్మానియా జనరల్ హాస్పిటల్‌కు రెఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతున్న జంగయ్య ఆదివారం మృతి చెందాడు. మృతుడి భార్య కృష్ణవేణి ఫిర్యాదు మేరకు ఆదివారం నాగోలు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.